# హ్యాట్రిక్‌కు వ్యూహం

- తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే.కేశవరావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు
- హాజరైన ఏడు నియోజకవర్గాల పరిధిలోని తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, గులాబీ శ్రేణులు





రంగారెడ్డి, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా ప్రతి రోజూ ఒక పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పార్టీ నేతలతో సమావేశాలను నిర్వహిస్తుండగా.. గత డిసెంబర్ చివరి వారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలపై ఒక దఫా సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం మరో దఫా చేవెళ్ల లోక్‌సభ స్థానంపై తెలంగాణ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో పార్టీ నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి చర్చించారు. చేవెళ్లలో మరోమారు గెలిచి హ్యాట్రిక్ కొట్టేలా పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. గెలుపు దిశగా గులాబీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన సన్నాహక సమావేశం పార్టీ కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే.కేశవరావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, సబితారెడ్డి, నిరంజన్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ రంజిత్‌రెడ్డి, తాజా, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులున్నారు.

## వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఎదురుండదు. వచ్చే అన్ని ఎన్నికల్లో గెలుపు బీఆర్‌ఎస్ పార్టీదే. ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవడంతో ప్రజలు బాధపడుతున్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమే. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటాం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు తేడా 1.8 శాతం ఓట్లు మాత్రమే. మా బలం.. బలగం కేసీఆర్. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్ గెలిచి తీరుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలో సన్నాహక సమావేశంలో చర్చించుకున్నాం.

## బీఆర్‌ఎస్‌కే విజయావకాశాలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో అంచనా వేస్తూనే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేలా బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహ రచన చేస్తున్నది. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని ఈసారి కూడా ఎలాగైనా గెలుచుకునేందుకు అవలంబించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలతో విస్తృతంగా చర్చిస్తున్నారు. 2009లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైంది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి అసెంబ్లీ సెగ్మెంట్లు ఈ లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. జనరల్ కేటగిరిలో ఉన్న ఈ స్థానానికి ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు బీఆర్‌ఎస్ విజయం సాధించింది. 2019లో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి గెలుపొందిన గడ్డం రంజిత్‌రెడ్డి ఈసారి కూడా ఇదే స్థానం నుంచి ఎన్నికల బరిలో ఉంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయా స్థానాల్లో లక్షకు పైగా మెజార్టీ ఓట్లు బీఆర్‌ఎస్‌కు వచ్చాయి. మరోసారి గెలుపు అవకాశం బీఆర్‌ఎస్‌కే ఉండే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్, యాదయ్య, బీఆర్‌ఎస్ యువనేత కార్తీక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లు, మాజీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జిల్లా పార్టీల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నేతలున్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అనుచరుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. మాజీ మంత్రి హరీశ్‌రావు కలుగజేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు

# 'కంప్యూటరీకరణ ప్రక్రియ' షురూ..

- షిఫ్ట్‌లవారీగా దరఖాస్తుల అప్డేషన్
- ప్రతి టీం ప్రతి రోజూ 350 దరఖాస్తుల చొప్పన వెయ్యి దరఖాస్తుల నమోదు
- ఈ నెల 17 వరకు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 10 గంటల వరకు ప్రక్రియ
- ఈ నెల 17 వరకు సిబ్బందికి సెలవులు, ఆదివారం సెలవులు రద్దు
- మండల ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ లలితాకుమారి



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మార్వో కిషన్, ఆర్ఐ రాజురెడ్డి

పెద్దేముల్, జనవరి 5 : ప్రభుత్వం అమలు చేయబోయే ఆరు గ్యారెంటీలకు సంబంధించి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ప్రజాపాలన అభయహస్తంలో భాగంగా కంప్యూటరీకరణ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రజాపాలన మండల స్పెషల్ ఆఫీసర్ లలితాకుమారి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో లక్ష్మప్ప అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా లలితాకుమారి మాట్లాడుతూ.. వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, గ్రామపంచాయతీలవారీగా, తేదీలవారీగా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలు టిక్ చేసిన వివరాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. టీంల వారీగా వివరాలను అప్డేట్ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 17 వరకు సిబ్బంది టీంల వారీగా డేటా ఎంట్రీ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 10 గంటల వరకు షిఫ్ట్‌లవారీగా నమోదు చేయాలన్నారు. ఈ నెల 17 వరకు ఎవ్వరికి కూడా సెలవులు, సండే సెలవులు ఉండవని, విధులకు గైర్హాజరు కావద్దని ఆదేశించారు. మండలంలో అన్ని కంప్యూటర్లను సిద్ధం చేశామని.. మొత్తం 3 టీంలకుగాను ఒక్కొక్క టీమ్ వారు ప్రతి రోజూ కనీసం 350 దరఖాస్తుల చొప్పున 1000 దరఖాస్తులను నవీకరించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. క్వాలిటీ, క్వాంటిటీని పాటిస్తూ పారదర్శకంగా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. అనంతరం మండలంలో దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజురెడ్డి, ఎంపీవో రమేశ్‌కుమార్, ఏవో నజీరొద్దీన్, కంప్యూటర్ ఆపరేటర్లు బసంత్‌రెడ్డి, ముస్తఫా, శ్రీను, శ్రీశైలం, ఈశ్వర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా గ్యాస్ సిలిండర్‌లు నిలువ చేసిన వ్యక్తిపై కేసు

వికారాబాద్, జనవరి 5 : కన్యాలాల్ బాగ్ కాలనీలో కొత్తపల్లి చంద్రారెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచుకొని అధిక ధరకు విక్రయిస్తున్నాడు. వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తన బృందం, వికారాబాద్ స్థానిక పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు చేశారు. ఈ దాడిలో 38 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనపరచుకుని వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

గంజాయి తరలిస్తున్న వ్యక్తులను జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు గంజాయితో బంట్వారం మండలం తొరుమామిడి గ్రామం వైపు వస్తున్నారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, బంట్వారం స్థానిక పోలీసులు కలిసి పక్కా సమాచారంతో బండమీదిపల్లి గేట్ సమీపంలో వాళ్లని అడ్డుకొని తనిఖీ చేశారు. వారి వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి లభించింది. గంజాయిని, ఇద్దరు వ్యక్తులను, ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దరఖాస్తుల స్వీకరణ

వికారాబాద్, జనవరి 5 : వికారాబాద్‌లోని 28, 29, 30, 31, 32 వార్డులలో ప్రజాపాలనను శుక్రవారం అధికారులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు అర్థమయ్యేలా వివరించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు స్వాతి, గాయత్రి, పుష్పలత, సువర్ణ పాల్గొన్నారు.

వికారాబాద్ టు హైదరాబాద్ నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సారథ్యంలో వికారాబాద్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. వికారాబాద్ ఆర్టీసీ డిపోలో 65 బస్సులుండగా అందులో 64 బస్సులు ఆర్డినరీ బస్సులు కాగా, కేవలం ఒకే ఎక్స్‌ప్రెస్ బస్సు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డిపో మేనేజర్ భక్షి నాయక్, కాంగ్రెస్ నాయకులున్నారు.



ధారూరు : శుక్రవారం తుల్జాభవానీ మాత జాతర ముగింపు కార్యక్రమాలు ఉదయం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ, సాయంత్రం బండిసిరె గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి తుల్జా భవానీ మాత ఆలయం వరకు తరలించి, గుడి చుట్టూ తిప్పారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాలొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అభ్యసన సామర్థ్యాలు వచ్చేలా కృషి చేయాలి

### టీఎల్ఎం నోడల్ ఆఫీసర్ నర్సింగ్‌రావు

పెద్దేముల్, జనవరి 5 : ఉపాధ్యాయులు తరగతిలో విద్యార్థులకు అభ్యసన స్థాయిలను పెంచి ఆశించిన సామర్థ్యాలు వచ్చేలా కృషిచేయాలని మండల టీఎల్ఎం నోడల్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మార్సీలో టీఎల్ఎంపై సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో టీఎల్ఎం వాడాలని, కథల పుస్తకాలు చదివించాలని, ప్రతి నెల 3వ శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యేలా బోధించాలని, కాంప్లెక్స్ సమావేశాలకు కచ్చితంగా రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు శివకుమార్, శంకర్, మురళీమోహన్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు గోబ్ర్యానాయక్, బందెప్ప, చంద్రశేఖర్, వెంకటరమణ, రాధ, సరోజ, సంధ్యారాణి, భవాని ఉన్నారు.



పరిగి : పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంతరం కాళ్లాపూర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.

## 11న జిల్లా పరిషత్ సమావేశం

వికారాబాద్, జనవరి 5 : వికారాబాద్ జడ్పీ సమావేశాన్ని ఈ నెల 11న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జానకీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్‌సీ భవనంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నందున, జిల్లా స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.